క్లుప్తంగా

పేద విద్యార్థి చదువు కోసం ఆర్థిక సాయం



బాపట్ల: పేద విద్యార్థిని చదువు కోసం ఆర్థిక సాయం చేయటం ఎంతో సంతోషంగా ఉందని కేకేఆర్ చారిటబుల్ ఫౌండేషన్ కార్యదర్శి ఓటికుండల లక్ష్మణరావు పేర్కొన్నారు. రాయల్ మెరైన్‌లో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న ఎం.ఏడుకొండలు చనిపోగా అతని కుమార్తె శ్రీ ప్రవల్లిక ఫామ్ డీ ద్వితీయ సంవత్సరం చదువుతుండటంతో రూ.61వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు విజయభాస్కర్‌రెడ్డి, శ్రీనివాస రెడ్డి, అంజిరెడ్డి, వేజండ్ల శ్రీనివాసరావు, జోగి సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను వినియోగించుకోండి

తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్‌బాబు

రేపల్లె రూరల్: తపాలాశాఖ అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెనాలి పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్‌బాబు చెప్పారు. తపాలా శాఖ సేవలపై మండలంలోని పేటేరు గ్రామంలో గురువారం ప్రజలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోస్టల్ అకౌంట్‌లు, వివిధ పాలసీలు, పోస్టల్ ఇన్సూరెన్స్‌లపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అధికారి ఏడుకొండలు, ఎంవో నరేంద్ర, రేపల్లె ప్రాంత వివిధ బ్రాంచ్‌ల పోస్ట్‌మాస్టర్‌లు, అసిస్టెంట్ బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



చందోలు(కర్లపాలెం): చోరీ కేసులో నిందితుడిని అదుపులోకి తీసుకుని చోరీకి గురైన సొత్తును రికవరీ చేశామని చందోలు ఎస్‌ఐ శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. 2023 నవంబర్‌లో పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన కల్లేపల్లి శ్రీనివాసరావు బంధువుల ఇంట్లో చోరీ జరిగింది. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పోలీసులు పొన్నూరు పట్టణానికి చెందిన షేక్ కరిముల్లా చోరీ చేసినట్లు గుర్తించారు. చోరీకి గురైన కలర్ టీవీతో పాటు రెండు సవర్ల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.

వాల్మీకి మహర్షి చిరస్మరణీయులు



రేపల్లె రూరల్: ఆదర్శవంతులైన శ్రీరాముని జీవితాన్ని ప్రజలు ఆచరించేలా రామాయణ మహాకావ్యాన్ని మలచిన వాల్మీకి మహానుభావుడని, ఆయనను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీడీఓ ఎం.శోభారాణి చెప్పారు. రామాయణ కర్త వాల్మీకి జయంతి సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వాల్మీకి రచించిన భారతీయ సంస్కృతిసంప్రదాయాలకు అద్దంపట్టే రామాయణ మాహాకావ్యం సదా ఆచరణీయమని చెప్పారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోండి



తెనాలిఅర్బన్: అర్హులైన ప్రతి ఒక్కరూ బీసీజీ వ్యాక్సిన్‌ను వేయించుకోవాలని తెనాలి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పల్లెకొండ రవికుమార్ కోరారు. 37వ వార్డులోని వార్డు సచివాలయంలో గురువారం నిర్వహించిన వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్‌పై అపోహలు విడాలన్నారు. బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవడం వలన క్షయను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ముంగిళ్లలో మురుగు



భట్టిప్రోలు మార్కెట్ వెనుక జెండా చెట్టు వద్ద రహదారిపైకి చేరిన డ్రెయినేజీ నీరు



భట్టిప్రోలులో డ్రెయిన్‌లో మగ్గుతున్న తాగునీటి కుళాయి

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- డ్రెయినేజీ వ్యవస్థ దారుణం
- ముందుకు కదలని మురుగునీరు
- ప్రబలుతున్న దోమలు

భట్టిప్రోలు: గ్రామ పంచాయతీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. రోడ్లపైనే మురుగునీరు పొంగిపొర్లుతోంది. ఫలితంగా దోమలు ప్రబలుతున్నాయి. దీనికితోడు ఎక్కడపడితే అక్కడ చెత్తను పడేయడంతో రోడ్లు వ్యర్థాలకు నిలయాలుగా మారుతున్నాయి. డ్రెయిన్‌లో పూడిక సజావుగా తీయట్లేదనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. డ్రెయినేజీలు ఎగుడుదిగుడుగా నిర్మించడం వల్ల మురుగునీరు సరిగా పారడం లేదని చెబుతున్నారు. దీనివల్ల భారీ వర్షాలు కురిసినప్పుడు మురుగు నీరు విఠలేశ్వర నగర్ వైపు ఎగదన్నుతోంది. ఆ ప్రాంతం ముంపునకు గురవుతోంది. దోమల నివారణకు పంచాయతీ అధికారులు తీసుకుంటున్న చర్యలేమీ ఉండట్లేదు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి



అధికారులు స్థానికంగా నివాసం ఉంటే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయి. పంచాయతీ అధికారులు డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం చూపాలి. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి.

– పీఎస్సార్ ప్రసాద్, అద్దేపల్లి, భట్టిప్రోలు

అధ్వానంగా పారిశుద్ధ్యం



గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది. వీధుల్లో మురుగు నీరు రోడ్లపైకి ప్రవహిస్తోంది. దోమల బెడద అధికంగా ఉంది. కొద్ది రోజుల క్రితం తాతావారిపాలెంలో జ్వరాలు విజృంభించాయి. సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి.

– కటకం సాంబశివరావు, భట్టిప్రోలు

కార్యదర్శిని పిలిపించి మాట్లాడతాను



భట్టిప్రోలు పంచాయతీలో నెలకొన్న పరిస్థితిపై కార్యదర్శిని పిలిపించి మాట్లాడతాను. తాను కొత్తగా రావడంతో ఇప్పుడిప్పుడే మండలంలోని గ్రామాల్లో సమస్యలపై పూర్తి స్థాయిలో సమాచారం సేకరించి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాను. ముఖ్యంగా వర్షాకాలం దృష్ట్యా పారిశుద్ధ్యం, డ్రెయినేజీ సమస్యలపై దృష్టిసారిస్తాం.

ఎస్‌వీ రమణ, ఎంపీడీఓ, భట్టిప్రోలు

సమస్యల పరిష్కారంతోనే అభివృద్ధి

ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు

కర్లపాలెం: ప్రజా సమస్యల పరిష్కారంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు చెప్పారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలసి ఎమ్మెల్యే శాఖల వారీగా మండల స్థాయి అధికారులతో సమీక్ష చేశారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు తమ గ్రామంలోని రైతులకు చెందిన 150 ఎకరాలలోని వరి పొలాలు వరద ముంపునకు గురై పాడైపోయాయని, వ్యవసాయాధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, రైతులకు నష్ట పరిహారం అందలేదని చెప్పారు. నల్లోతువారిపాలెం ఎంపీటీసీ సాంబశివరావు మాట్లాడుతూ తమ గ్రామంలోని పాఠశాలలో ఉపాధ్యాయిని సరిగ్గా పనిచేయకపోవటంతో 25 మంది విద్యార్థులకు గాను నలుగురు విద్యార్థులే పాఠశాలకు వస్తున్నారని చెప్పారు. తుమ్మలపల్లి సర్పంచ్ దబ్బుకూటి ఏడుకొండలు మాట్లాడుతూ తుమ్మలపల్లి చానల్‌లో తూటికాడ



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు

పెరిగి సాగునీరు సరిగా రావటంలేదని తూటికాడ తీయించాలని ఇరిగేషన్ అధికారులను కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి గోపీచంద్ మాట్లాడుతూ కర్లపాలెం గణపవరం, పెదపులుగువారిపాలెం గ్రామాలలో బాల్య వివాహాలు జరుగుతున్నాయని, సంబంధిత అధికారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు మాట్లాడుతూ సమావేశంలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను అధికారులు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పిట్ల వేణుగోపాల్‌రెడ్డి తహసీల్దార్ సుందరమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

మద్యం ధ్వంసం



చందోలు(కర్లపాలెం): మద్యం అక్రమంగా కలిగి ఉన్నా, విక్రయించినా చట్ట ప్రకారం నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు తెలిపారు. చందోలు పోలీసులు 27 కేసుల్లో స్వాధీనం చేసుకున్న 222 మద్యం బాటిళ్లను గురువారం చందోలులో డీఎస్పీ రామాంజనేయులు, రూరల్ సీఐ హరికృష్ణ, స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎస్‌ఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో కలసి ధ్వంసం చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాలలో బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించ రాదని తెలిపారు.

- బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు, సీఐ హరికృష్ణల పర్యవేక్షణలో గురువారం కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ఎస్.రవీంద్ర తమ సిబ్బందితో కలసి 22 కేసుల్లో పట్టుకున్న 208 మద్యం క్వార్టర్ బాటిళ్లను ధ్వంసం చేశారు.

వేంకటేశ్వరుని ఆదాయం రూ.32.90 లక్షలు



తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం 75 రోజుల కాలపరిమితికి భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల హుండీల లెక్కింపు నిర్వహించారు. పొన్నూరులోని శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి టి.శ్రీనివాస్ సమక్షంలో హుండీ లెక్కింపు చేశారు. అనంతరం రూ.32,90,502 నగదు, 81.500 గ్రాముల బంగారం, 1,575 గ్రాముల వెండి వచ్చినట్టు వైకుంఠపురం ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ తెలియజేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు కనికచర్ల చరణరత్న సందీప్, వంగల జగదీశ్వరి, కురగంటి సునీత -రవి శంకర్, బొద్దులూరి సరస్వతి-నాగేశ్వరరావు, మావులూరి శ్రీనివాస్, ముంతా ప్రసాద్, దేవరకొండ వెంకటరమణ-శంకరరావు, ఎక్స్‌అఫీషియో సభ్యుడు అశహరి రవి కుమార్, ఏపీసీవో బ్యాంక్, చెంచుపేట సిబ్బంది, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

బాపట్ల: పట్టణంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు కోరారు. మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.రఘునాథరెడ్డిని గురువారం పార్టీ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ జి.రఘునాథరెడ్డికి వివరించారు. పట్టణంలో రోడ్ల విస్తరణ సందర్భంగా తొలగించిన విగ్రహాలను వాటి స్థానంలో ఏర్పాటు చేయాలని కోరారు. పట్టణంలో అంటువ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. వరద నీరు ఎక్కడపడితే అక్కడ నిల్వ ఉండ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినతి పత్రం అందించిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు కోకి రాఘవరెడ్డి, ఎస్సీసెల్ పట్టణ అధ్యక్షులు జోగి రాజా, సోషల్ మీడియా నాయకులు అడే చందు, తన్నీరు అంకమ్మరావు, ఆఫ్జల్, పసుమర్తి సాల్మన్, గోపి, శ్రీను తదితరులు ఉన్నారు.



మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సైబర్ నేరాలపై అవగాహన ఏర్పరచుకోవాలి

తెనాలి డీఎస్పీ జనార్దనరావు

అత్తోట(కొల్లిపర): రోజు రోజుకు నూతన టెక్నాలజీతో ప్రపంచం ముందుకు పోతున్న సమయంలో దానికి అనుగుణంగా వివిధ సైబర్ నేరగాళ్లు కూడా పెరుగుతున్నారు అని ఇటువంటి సమయంలో ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండి నేరాలను అరికట్టాలని తెనాలి డీఎస్పీ బి. జనార్దనరావు సూచించారు. జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని అత్తోట గ్రామంలో గురువారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెనాలి డీస్పీ బి.జనార్దనరావు , ట్రైనీ ఎస్పీ ఎం.ఎస్ భార్గవి, సీఐ బెల్లం శ్రీనివాసరావు పాల్గొని డ్వాక్రా మహిళలకు, రైతులకు సైబర్ నేరాలతో పాటు వివిధ నేరాల గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ట్రైనీ ఎస్పీ ఎం.ఎస్ భార్గవి మాట్లాడుతూ మహిళలు బ్యాంకుల వద్ద నుంచి డబ్బులు తీసుకువెళ్లే సమయంలో బ్యాంకు ఆవరణలో ఉన్న అపరిచితులు పదేపదే వారిని చూస్తున్నా , వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, వారు చెప్పే మాయ మాటలు నమ్మకుండా ఉండాలని, ఏమైనా అనుమానం వస్తే వెంటనే అక్కడ ఉన్న బ్యాంకు మేనేజర్ గాని దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌లో గాని సమాచారం అందించాలని సూచించారు.

సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి మీము బ్యాంకు నుండి, ఫలానా కంపెనీ నుంచి లేదా మీకు లాటరీ



అత్తోటలో అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తగిలింది అని నమ్మపలికి మీ ఖాతాలో రూ.50 వేల నుంచి లక్ష వరకు డబ్బులు వస్తాయి అని నమ్మపలికి , మొత్తం మీ ఖాతాలో డబ్బులు జమ కావాలంటే ముందుగా మీరు మీము చెప్పిన ఖాతాకు నామాత్రం ఫీజు చెల్లించాలని చెప్పి తరువాత మీ దగ్గర నుంచి మీ ఖాతా వివరాలు, ఓటీపీలు తెలుసుకుని మీ ఖాతాల్లో ఉన్న సొమ్ము మొత్తం వారి ఖాతాలో జమ చేసుకోవటం జరుగుతుందని ఇటు సంఘటనలుపై ప్రజలు అవగాహన కలిగి ఉండి ఇటువంటి సైబర్ నేరాలు జరగకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. అనంతరం పోలీస్ వారు ప్రజలకు సైబర్ నేరాలు ఎన్ని రకాలు, వాటి ద్వారా నేరగాలు ఏ విధంగా మోసాలు చేస్తారు అన్న విషయాలను వీడియోలు ద్వారా ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు , ఎఎస్‌ఐ పోతురాజు, సిబ్బంది తాతరావు, కూర్మారావు, నాగబాబు, విజయ్, రైతులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ



తెనాలి: నిరాశ్రయులయిన కొలకలూరు గిరిజనులకు ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం బియ్యం, కూరగాయలు,ఆహారం పొట్లాలను పంపిణీచేశారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులో కొమ్మమూరు కాల్వ కట్టపై తాత్కాలిక గుడిసెల్లో నివసిస్తున్న గిరిజనులకు వర్షాలకు తక్షణసాయంగా నిత్యావసరాలను పంపిణీ చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ రావూరి అంజలి తెలిపారు. కాల్వకట్టపైన గుడిసెలపై వేసుకున్న ప్లాస్టిక్ పరదాలు ఈదురుగాలులకు లేచిపోగా ప్రస్తుతం వంతెన కింద నిరాశ్రయులుగా జీవిస్తూ దయనీయంగా బతుకుతున్నారని అంజలి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి నిరాశ్రయులను గుర్తించి వసతి సౌకర్యం కల్పించాల్సిందిగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రావూరి సురేష్‌బాబు, ట్రస్ట్ వలంటీర్ షేక్ షబ్బీర్, బొంత కృపమ్మ పాల్గొన్నారు.

బడి ముందు మద్యం షాపులేంటీ?



మద్యం దుకాణం ఏర్పాటుకు సిద్ధం చేసిన గృహంలోని షాపు



స్థానికులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రభుదాస్

- అనుమతి ఎవరిచ్చారు?
- రైలుపేట వాసుల ఆగ్రహం
- రంగంలోకి దిగిన ఎక్సైజ్ అధికారులు
- దుకాణం మార్చేస్తామంటూ హామీ

బాపట్లటౌన్: 'ఓ వైపు బడి.. మరోవైపు గుడి నిత్యం మహిళలు తిరిగే ప్రాంతమిది.. గృహాల మధ్యలో మద్యం దుకాణం పెట్టడం ఏంటీ.. అసలు పర్మిషన్ ఎవరు ఇచ్చారు. ఎవరినడిగి మీరు ఈ ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేస్తున్నారు' అంటూ పట్టణంలోని 3వ వార్డు రైలుపేట వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం శ్రీనివాస వైన్స్ పేరుతో గృహాల మధ్యలో షాపు ఏర్పాటుకు సిద్ధమైన నిర్వాహకులపై మండిపడ్డారు. దీంతో నిర్వాహకులు సమాధానం చెప్పకుండా అక్కడి నుంచి జారుకున్నారు. దీంతో స్థానికులు మద్యం షాపు కోసం ఇల్లు అద్దెకు ఇచ్చిన యజమాని వద్దకు వచ్చి నిలదీశారు. మద్యం షాపు కోసం ఇవ్వద్దని హెచ్చరించారు. యజమాని నుంచి సరైన సమాధానం రాకపోవడంతో స్థానికులు అక్కడే ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్‌ఐ ప్రభుదాస్ ఘటనా స్థలానికి చేరుకొని స్థానికులతో చర్చించారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం లేకుండా చూస్తామని, గుడి, బడి, గృహాల మధ్యలో మద్యం దుకాణాల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులూ లేవని, అలా ఎవరు ఏర్పాటుచేసినా వారి లైసెన్స్‌లు రద్దు చేస్తామని పేర్కొన్నారు. గుడి, బడులకు 100 మీటర్ల లోపల మద్యం షాపులు ఏర్పాటు చేయకూడదనే నిబంధనలు ఉన్నాయని స్పష్టం చేశారు. అద్దెలకు ఆశపడి ఎవరైనా ఇళ్లను మద్యం షాపులకు ఇస్తే వారిపైనా కేసులు నమోదుచేస్తామని చెప్పారు. ఎక్సైజ్ ఎస్‌ఐ హామీ మేరకు స్థానికులు ఆందోళన విరమించారు.

గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదుపై అవగాహన

వేమూరు: గుంటూరు, కృష్ణా ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓట్ల నమోదు కోసం కార్యకర్తలు చురుగ్గా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు చెప్పారు. వేమూరులోని లక్ష్మీ గణపతి కల్యాణ మండపంలో వేమూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ వేమూరు నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓట్ల నమోదు కోసం ప్రతి ఒక్కరూ పని చేయాలని సూచించారు. గౌతమ్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హామీలు మోసపూరితమైనవని పేర్కొన్నారు. తాను విజయవాడలో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేశానని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ వేమూరు మండల అధ్యక్షులు బొల్లిముంత ఏడుకొండలు, అనపు రెడ్డి రాఘురామి రెడ్డి, కోగంటి లవకుమార్, ఎంపీపీలు దావూరి వెంకట లలితా కుమారి, జాలాది రూబేను, జెడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, కొండ శివ ప్రసాద్ రెడ్డి, పెరికల పద్మారావు, దాట్ల మోహన్ రెడ్డి, వుయ్యూరి అప్పి రెడ్డి, విష్ణుమొలకల వెంకట రెడ్డియ్య, లంక శ్రీనివాసరావు, మోర్ల శ్రీనివాసరావు, పడమటి శ్రీనివాసరరావు, కుందేటి రమేష్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



వేమూరు లక్ష్మీ గణపతి కల్యాణ మండపంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేత అశోక్‌బాబు, చిత్రంలో గౌతమ్ రెడ్డి

బాణసంచా వ్యాపారులు నిబంధనలు పాటించాలి

చెరుకుపల్లి: బాణసంచా అమ్మే వ్యాపారులు నిబంధనలను పాటించాలని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. చెరుకుపల్లిలోని టపాకాయల గోడౌన్లను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గోడౌన్లలో ముందస్తు జాగ్రత్త చర్యలుగా నీటితో నింపిన డ్రమ్ములను, ఇసుక బకెట్‌లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. విద్యుత్ తీగలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని చెప్పారు. టపాకాయలు దాచే గోడౌన్లు గ్రామ శివారుల్లోనే ఉండాలని, గ్రామం మధ్యలో ఉండరాదని హెచ్చరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రెండు గోడౌన్లను పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఐ అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



టపాకాయల గొడౌన్‌ను పరిశీలిస్తున్న రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

పట్టభద్రులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

రేపల్లె రూరల్: డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్), సీఐటీయూల ఆధ్వర్యంలో పట్టణంలోని నల్లూరి హాస్పిటల్ సెంటరు సదాశివ కాంప్లెక్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలంటే డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. నవంబర్ 6వ తేదీ వరకు యూటీఎఫ్, సీఐటీయూ ఇతర ప్రజాసంఘాల సభ్యులు ఓటు నమోదు ప్రక్రియను ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 8 గంటల వరకు ఉచితంగా ఆన్‌లైన్ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని పట్టభద్రులందరూ తమ సర్టిఫికెట్‌లను అందించి ఓటు హక్కు కోసం ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం కార్యాలయంలోగానీ, 8099277623, 9177075876 నంబర్లనుగానీ సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంవీ సుబ్రమణ్యం, యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు జి.రవీంద్ర, రాజభూషణం, సుబ్బారావు, రత్నరాజు, ఆశీర్వాదం, కే.రమేష్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఓటింగ్ నమోదు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్

సబ్సిడీ సరుకుల విక్రయ కేంద్రాల తనిఖీ

తెనాలిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు రైతు బజార్లలో సబ్సిడీ ధరలకు కందిపప్పు, నూనె విక్రయిస్తున్న స్టాల్స్‌ను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఇక్కడి పాత రత్నాటాకీస్ సమీపంలోని గాంధీ ఇర్విన్ పార్క్ రైతు బజార్‌లో విక్రయాలకు సంబంధించి స్టాల్స్ వద్ద సరుకుల వివరాల ప్రదర్శన, ధరలను తనిఖీ చేశారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు, తక్కువ ధరలకు సరుకుల విక్రయాలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట సీఎస్ డీటీ మూర్తి, ఎస్టేట్ ఆఫీసర్ మురళి ఉన్నారు.



సాటల్ నిర్వాహకుడికి సూచనలిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ